సాక్షి
పల్నాడు

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



పోలీసు కవాతు

క్రోసూరు: మండలంలోని పారుపల్లి, పీసపాడు గ్రామాల్లో మంగళవారం సీఐ మంగారావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు.



ఘనంగా హరిద్ర శృంగారార్చన

పిట్టలవానిపాలెం: చందోలులో ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన నిర్వహించారు. బండ్లమ్మను మహా గౌరీదేవిగా అలంకరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
నరసరావుపేట	6.28	4.46
గుంటూరు	6.26	4.44
బాపట్ల	6.26	4.44

న్యూస్‌రీల్

హర్షవర్ధన్‌కు అరుదైన గౌరవం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): మాజీ భారత జట్టు క్రీడాకారుడు, ఆంధ్రప్రదేశ్ హాకీ ప్రధానకార్యదర్శి హర్షవర్ధన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయనను హాకీ ఇండియా ఢిల్లీలో 'ఇంటర్నేషనల్ అంపైర్స్ మేనేజర్' అవార్డుతో సత్కరించింది. అవార్డుతోపాటు రూ.2.5 లక్షల నగదు బహుమతిని అందజేశారు. ఆంధ్రా నుంచి ఈ అవార్డు అందుకున్న తొలి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. సోమవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో హాకీకి విశేష సేవలందించిన వారికి దక్కే గౌరవాన్ని హర్షవర్ధన్ దక్కించుకోవడం చాలా సంతోషమని ఆయన సతీమణి డబుల్ ఒలింపియన్ సత్తిగీత సంతోషం వ్యక్తం చేశారు. హర్షవర్ధన్ స్వస్థలం గుంటూరు జిల్లానే. జాతీయ, అంతర్జాతీయ హాకీ పోటీలకు ఆయన అంపైర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో హాకీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావుతోపాటు హాకీ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

యార్డులో 1,12,064 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,12,064 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,08,718 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,200 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 83,228 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

మండుతున్న రెంటచింతల



రెంటచింతల: రెంటచింతల కొద్దిరోజులుగా మండుతుంది. ఆది, సోమ, మంగళవారాలలో గరిష్ట ఉష్ణోగ్రత 41.4, 41.8, 42.5 డిగ్రీలుగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్ నెల ప్రారంభంలోనే గ్రామంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదుకావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు ఉదయం 10గంటల తర్వాత బయటకు రావడానికి జంకుతున్నారు.

చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్ట భద్రత

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12 చెక్‌పోస్టులు చేసి పోలీస్ సిబ్బంది 24/7 విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.4,63,65,316 విలువ చేసే నగదు, గంజాయి, అక్రమ మద్యాన్ని సీజ్ చేశామన్నారు. అక్రమ మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, బహుమతులను వివిధ రూపాలలో అక్రమ రవాణా చేసే అవకాశం ఉంటుంది కనుక ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

పార్థసారథి అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి వారు ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి పార్థసారథి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోగా ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

కష్టం గుర్తించారు.. కాపు కాశారు

- కాపులను అక్కున చేర్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- కాపు నేస్తం రూపంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు బాసట
- 2,684మందికి నాలుగేళ్లలో రూ.12.20 కోట్ల సాయం
- చంద్రబాబు దగా చేశారంటూ లబ్ధిదారుల ఆగ్రహం



2023 సెప్టెంబర్ 16న కాపు నేస్తం చెక్కు మహిళలకు అందజేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

దాచేపల్లి : సామాజికవర్గాల వారీ సంక్షేమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనదైన చెరగని ముద్ర వేసుకుంటున్నారు. ఇప్పటి దాకా రాష్ట్రంలో ఎవరి పాలనలోనూ లేని విధంగా బడుగు, బలహీన, ఆర్థిక వెనుకబాటుతో వెతలుపడేవారికి నేనున్నానంటూ పలు రూపాల్లో పథకాలను వారి చెంతకు చేర్చారు. అలాంటివారిలో కాపు సామాజిక వర్గం ఒకటి. అవహేళన చేసి..ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చకుండా వారిని పక్కనబెట్టేసిన ఘనత గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదైతే...కాపులకు వెన్నుదన్నుగా నిలిచి చెప్పినదానికంటే మిన్నగా సాయపడుతోన్న నాయకుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మేనిఫెస్టోలో వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని అమలుచేశారు. దీంతో ఆ వర్గంలోని నిరుపేదలైనవారికి ఆర్థిక ఆసరా లభించింది. వారిని బలోపేతం చేసింది. కాపు సామాజిక వర్గంలో 45– 60 ఏళ్ల లోపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు ఏటా రూ.15 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తూ వారి వికాసానికి బాటలు వేసింది. ఇప్పటిదాకా నాలుగు దఫాలుగా ఒక్కొక్కరికి రూ. 60వేలు అందించింది. కాపు, బలిజ, తెలగ కులాలకు చెందిన మహిళలు లబ్ధి పొందారు.

మండలం	లబ్ధిదారుల సంఖ్య
దాచేపల్లి	1,210
మాచవరం	470
గురజాల	535
పిడుగురాళ్ల	469
మొత్తం	2,684

బాబు కసురుకున్నారు.. జగన్ కాపు కాశారు..

గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు కాపులను ఆదుకుంటానన్నారు. రిజర్వేషన్లు కల్పిస్తానంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ఏడాదికి వెయ్యి కోట్ల రూపాయల నిధి చొప్పున ఐదేళ్లలో రూ.5వేల కోట్లు ఇస్తానంటూ హామీ ఇచ్చారు. కాపు, తెలగ, బలిజ సామాజిక వర్గంలోని నిరుద్యోగులను ఆదుకుంటానన్నారు. తీరా డిమాండ్లు నెరవేర్చమంటే కాపులపై కసురుకున్నారు. న్యాయపోరాటం చేస్తే కక్ష గట్టారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అలా చేయలేదు. ఏడాదికి రూ.2 వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.10వేల కోట్లు కేటాయిస్తానని చెప్పారు. అయితే అంతకంటే రెండింతల మేలు చేసి వారికి అండగా ఆర్థిక భరోసా కల్పించారు.

గురజాల నియోజకవర్గంలో చూస్తే...

వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా గురజాల నియోజకవర్గ వ్యాప్తంగా 2,684 మందికి ఈ నాలుగేళ్లలో రూ.12,20,70,000 సాయం ప్రభుత్వం నుంచి అందింది. నియోజకవర్గంలో మండలాల వారీ లబ్ధిదారుల వివరాలిలా ఉన్నాయి.

మమ్మల్ని గుర్తించింది జగన్ మాత్రమే



గత ప్రభుత్వాలు కాపులను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నాయి. మేము కూడా వారి మాటల్ని విని మోసపోయాం. కానీ జగనన్న సీఎం అయ్యాక మా స్థితి గతులు తెలుసుకున్నారు. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాపు నేస్తం పథకం రూపంలో భరోసానిచ్చారు. ఇప్పటిదాకా మూడు పర్యాయాలు పథకంతో ప్రయోజనం పొందాను.

–కటికాల నర్సమ్మ, పెదగార్లపాడు

సీఎం ఆదరించారు.. అండగా నిలబడతాం



సీఎం జగన్ మాకు పెద్దదిక్కుగా నిలిచారు. కాపు నేస్తం పథకంతో ఎంతగానో లబ్ధి పొందాం. ఏడాదికి రూ.15 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.60 వేలు అందుకున్నా. దీంతో పాటు నెలకు రూ.3 వేలు పింఛన్ వస్తోంది. వైఎస్సార్ ఆసరా ద్వారా మరో రూ.15 వేలు లబ్ధి పొందా. ప్రభుత్వ సాయంతో కుటుంబ అవసరాలు తీర్చుకున్నాం. కాపు సామాజికవర్గానికి చెందిన మాలాంటోళ్లకు సీఎం జగన్ అండగా నిలిచి అక్కున చేర్చుకున్నాడు. ఆయన చేసిన మరిచిపోం. అండగా నిలబడతాం.

– మునగా సీతారావమ్మ, దాచేపల్లి

మా పాలిట దైవం జగన్



నాకు భర్త లేడు. నా ఆరోగ్యం అంతంత మాత్రమే. కాపు నేస్తం ద్వారా నాకు సాయం అందుతోంది. నెలకు రూ.3 వేలు పింఛన్ వస్తోంది. కాపు నేస్తం, పింఛన్ డబ్బులతో నా ఆరోగ్యానికి కావాల్సిన మందులు కొనుగోలు చేసుకుంటున్నా. ఇవే లేకపోతే నా పరిస్థితి ఎలా ఉండేదో తలచుకుంటే భయమేస్తోంది. ఈ రెండు పథకాలందించి ముఖ్యమంత్రి జగన్ నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. నాలాంటి వాళ్ల పాలిట ఆరాధ్యదైవంగా నిలిచారు.

– చల్లపల్లి సామ్రాజ్యం, దాచేపల్లి

పల్నాడు ఎస్పీ బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎన్నికల కమిషన్
- అడిషనల్ ఎస్పీకి బాధ్యతలు అప్పగింత
- రెండేళ్లపాటు ఎస్పీగా విధులు నిర్వర్తించిన ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి



వై రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా తొలి ఎస్పీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారివై వై.రవిశంకర్‌రెడ్డిని ఎన్నికల కమిషన్ మంగళవారం బదిలీ చేసింది. రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్, ఆరుగురు ఐపీఎస్ అధికారులను ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఆ జాబితాలో పల్నాడు ఎస్పీ ఉన్నారు. ఈసీ ఆదేశాలతో ఎస్పీ బాధ్యతలను ప్రస్తుత అడిషనల్ ఎస్పీ రాఘవేంద్రకి అప్పగించారు. తదుపరి ఎస్పీగా మూడు పేర్లను సూచించమని ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకటి రెండు రోజుల్లో నూతన ఎస్పీని ఎన్నికల కమిషన్ నియమించనుంది.

రెండేళ్లపాటు ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి...

వై రవిశంకర్‌రెడ్డి గుంటూరు రూరల్ ఎస్పీగా ఏప్రిల్ 3, 2022లో బాధ్యతలు తీసుకున్నారు. మరుసటి రోజు ఏప్రిల్ 4వ తేదీన రాష్ట్రంలో 13 కొత్త జిల్లాలు ఏర్పడిన క్రమంలో నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లా తొలి ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఎస్పీగా మంగళవారానికి రెండేళ్లు పూర్తయిన రోజే బదిలీ అవ్వడం విశేషం. ఈ రెండేళ్లలో కొత్తగా ఏర్పాటైన జిల్లా పోలీసు కార్యాలయానికి ఓ రూపురేఖలు తెచ్చారు. నరసరావుపేటలో డీపీఓ ఏర్పాటైనప్పుడు పరిపాలనకు సరిపడా భవనాలు, వసతులు లేవు. రవిశంకర్‌రెడ్డి తొలి రోజు నుంచే ఓ వైపు మెరుగైన పోలీసింగ్ అందిస్తూనే, జిల్లా కార్యాలయానికి మౌలిక వసతులను కల్పించడం ప్రారంభించారు. నేడు కొత్తగా ఏర్పాటైన జిల్లాల డీపీఓలలో పల్నాడును మెరుగైన కార్యాలయంగా మార్చారు. డీపీఓలో పనిచేసే సిబ్బంది భోజనానికి ఇబ్బందిపడకూడదన్న ఉద్దేశంతో 'పోలీస్ క్యాంటీన్'ను ప్రారంభించారు. రుచి, శుచితోపాటు ఆరోగ్యకరమైన భోజనాన్ని సబ్సిడీతో రూ.40కే అందజేశారు. బొల్లాపల్లి లాంటి మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత వైద్య క్యాంపులను ఏర్పాటు చేశారు.

తగ్గిన నేరాలు...

రవిశంకర్‌రెడ్డి ఎస్పీగా పనిచేసిన రెండేళ్ల కాలంలో పల్నాడు జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా హత్యలు, నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలను బాగా నివారించగలిగారు. కేసుల నమోదులో సుమారు 30 శాతం తగ్గుదల కనిపించడం విశేషం. ముఖ్యంగా కోటప్పకొండ తిరునాళ్లను పోలీసు శాఖ పరంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయవంతంగా నిర్వహించారన్న పేరుంది. ఏపీకి చెందాల్సిన నాగార్జునసాగర్ డ్యాం గేట్లను స్వాధీనం చేసుకునే క్రమంలో ఇటీవల తెలంగాణ పోలీసులతో జరిగిన ఘర్షణలో రవిశంకర్‌రెడ్డి పాత్రపై ఈ ప్రాంతరైతుల నుంచి ప్రశంసలు పొందారు.

ఆరులోపు పింఛన్ల పంపిణీ పూర్తిచేయండి

నరసరావుపేట: జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ పంపిణీ చేపట్టి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శనివారం సాయంత్రానికి వందశాతం పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో పింఛన్ల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పింఛనుదారులలో అవగాహనకు టామ్‌టామ్ నిర్వహించాలని అన్నారు. ప్రతి క్లస్టర్‌కి ప్రత్యేక అధికారి నియమించి పర్యవేక్షించేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా సచివాలయం వద్ద తాగునీటి వసతి, టెంట్లు ఏర్పాటుచేయాలని, కూర్చునే విధంగా కుర్చీలు కూడా ఉంచాలని సూచించారు. ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి పది గంటల వరకు ఎండ తీవ్రత లేని వేళల్లో పింఛన్లు పంపిణీ చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పంపిణీ ప్రక్రియలో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఎవరు ఉండకూడదని తెలిపారు. 85ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు హోం ఓటింగ్ కల్పించే విధంగా 12డీ ఫారాలను బీఎల్వోల చేత అందజేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

చరిత్రలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యమిచ్చారా?

- సామాజిక సాధికారతపై టీడీపీ నేతల్ని నిలదీయండి
- బీసీల ఆత్మగౌరవం కాపాడతాం
- మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదిరించి, ఆశీర్వదించండి
- ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, గురజాల ఎమ్మెల్యే కాసు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ చరిత్రలో తొలిసారిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ కేటాయించారని, రాష్ట్రంలో సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడిందని నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మాచవరం మండలం కొత్త గణేశునిపాడు, తురకపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో మంగళవారం వారు ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎంతో రాజకీయ ప్రాధాన్యం కలిగిన పల్నాడులో బీసీలకు టీడీపీ ఇప్పటి వరకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన పరిస్థితి లేదన్నారు. నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గురజాల ఎమ్మెల్యే సీటు జంగా కృష్ణమూర్తికి ఇచ్చి గెలిపించారని, నేడు తండ్రి బాటలోనే తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు ప్రాంతానికి చెందిన ఏసురత్నం, జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్యవరప్రసాద్‌లకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారని, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా దేవళ్ల రేవతికి కేటాయించి రాజకీయ ప్రాధాన్యం కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే గురజాల నియోజకవర్గంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. 45 ఏళ్ల చరిత్ర కలిగిన టీడీపీ గురజాల నియోజకవర్గంలో బీసీ వర్గాలకు ఇంత వరకు ఎందుకు న్యాయం చేయలేదో చొక్కా పట్టుకొని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పని చేస్తుందని అన్నారు. బీసీల ఆత్మ గౌరవం కాపాడతామని హామీ ఇచ్చారు. మోర్జంపాడు గ్రామంలో గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి, గ్రామస్తులతో మాట్లాడారు. పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నే సైదా, జిల్లా కార్యదర్శి జిలుగు నరసింహారెడ్డి, మండల యూత్ కన్వీనర్ మద్దు ప్రసాదు, సర్పంచ్ అల్లా భక్షు, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లగుండ్ల రాంబాబు, రత్తయ్య, గోపి, వెంకటేశ్వర్లు, ప్రసాదు, శ్యాం, రఫీ, బాషా, దస్తగిరి, బ్రహ్మారెడ్డి, సర్పంచ్ కృష్ణవేణి, ఆవుల నరసింహారెడ్డి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నియమావళి 'జీవీ'కి పట్టదా!

- తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఎన్నికల ప్రచారం
- చర్చి నిర్మిస్తానంటూ హామీ



ఈస్టర్ వేడుకల్లో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ వినుకొండ పట్టణంలోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చికి వెళ్లి శుభాకాంక్షలు చెబుతానని జీవీ ఆంజనేయులు మైక్ అందుకున్నాడు. కొత్తగా నిర్మించబోయే చర్చికి తన సహాయ, సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చాడు. త్వరలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని, తాను తాగునీటి స్కీంలు పూర్తి చేస్తానంటూ చెప్పాడు. ఏసు ప్రభు తనకు ఘన విజయాన్ని అందించేలా ప్రార్థన నిర్వహించాలని కోరాడు. ఇది పూర్తిగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనంటూ పలువురు పట్టణవాసులు అభిప్రాయపడ్డారు.

హలీం రుచికి గులాం

పవిత్ర రంజాన్ మాసంలో మాత్రమే లభించే ప్రత్యేక వంటకం హలీం. రంజాన్ నెలలో ప్రతిరోజు తెల్లవారుజాము సహరి నుంచి సాయంత్రం ఇఫ్తార్ వరకు ఉపవాస దీక్షలు చేసే ముస్లింలు తక్షణ శక్తి కోసం హలీం తీసుకొని శరీరంలో శక్తిని పెంచుకుంటారు. హలీంలో హైప్రొటీన్లు, కాల్షియం, కేలరీలు పుష్కలంగా లభిస్తాయి. దీక్ష కారణంగా శరీరంలో లోపించే విటమిన్లు అందించేందుకు అనువైన ఆహారమే హలీం. అందుకే ఇది కేవలం రంజాన్ మాసంలోనే అందుబాటులో ఉంటుంది. ఏడాది పొడవునా అనేక రుచులను ఆస్వాదించే నాలుక హలీం కోసం అర్రులు చాస్తుంటుంది.

- రంజాన్ మాసంలో మాత్రమే లభించే ప్రత్యేక వంటకం
- ఒకప్పుడు హైదరాబాద్‌లోనే లభ్యం
- నేడు అన్ని చోట్లా తయారీ



హలీమ్ బట్టీ వద్ద కొనుగోలుదారుల సందడి

నరసరావుపేట ఈస్ట్: హలీం తయారీ ప్రత్యేకంగా ఉంటుంది. దాదాపు ఆరు నుంచి ఏడు గంటల పాటు పడుతుంది. తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, జీడిపప్పు, బాదం పప్పు, పిస్తా, యాలకులు, నల్ల మిరియాలు, కస్తూరి మేతి, గులాబ్ పత్తి, నల్ల మిరప తదితర రుచికర, బలవర్ధకమైన దినుసులను ఉపయోగిస్తారు. హలీంలో చికెన్, మటన్, వెజిటబుల్ అనే మూడు రకాలు ఉన్నాయి. ప్రస్తుతం చికెన్, మటన్ హలీం మాత్రమే తయారు చేస్తున్నారు. తయారీకి ప్రత్యేక బట్టీలను ఏర్పాటు చేస్తారు. తొలుత రెండు పెద్ద గిన్నెలు పట్టే పొయ్యిలు ఏర్పాటు చేస్తారు. వీటిపై గిన్నెలు పెట్టి వాటిలో చికెన్, మటన్‌లను మూడు నుంచి నాలుగు గంటలు ఉడికించి మెత్తటి పేస్టులా వచ్చే వరకు వండుతారు. గోధుమ రవ్వ, గరం మసాలా దినుసులను ఉడకబెట్టిన అనంతరం మెత్తటి పేస్టులా మారిన చికెన్, మటన్ వంటకాన్ని కలిపి మరోమారు కలయతిప్పుతూ గంట నుంచి రెండు గంటల పాటు వండుతారు. దీంతో రుచికరమైన హలీం సిద్ధమవుతుంది. కొనుగోలుదారులకు చిన్న చిన్న ప్లాస్టిక్ డబ్బాలలో వేసి దానిపై సన్నగా తరిగి నేతిలో వేయించిన ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వేసి వడ్డిస్తారు. కొలుగోలుదారుని స్తోమతును బట్టి ధర ఉంటుంది. చికెన్ హలీం ప్రారంభ ధర రూ.90లు నుంచి ఉంటుంది. మటన్ హలీం ధర చికెన్ కంటే అధికంగా ఉంటుంది.



వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న హలీమ్

జిల్లాలో జోరుగా అమ్మకాలు

జిల్లాలో హలీం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఏడాదిలో ఒక్క రంజాన్ మాసంలోనే లభించే ప్రత్యేక వంటకం కావడంతో సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 11గంటల వరకు బట్టీల వద్ద రద్దీ కనిపిస్తోంది. జిల్లావ్యాప్తంగా నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి వంటి పట్టణాలలో బట్టీలను ఏర్పాటు చేశారు. గ్రామాలకు పార్సిల్స్ తీసుకవెళ్లే వారి కోసం వేడి తగ్గకుండా ఉండేందుకు ప్రత్యేక ప్యాకింగ్ చేసి ఇస్తారు. తయారీలో చేయితిరిగిన వంట మాస్టర్లను హైదరాబాద్ నుంచి రప్పించి రుచికరమైన హలీంను అందిస్తున్నారు. కొన్ని బిర్యాని పాయింట్లలో బట్టీలను ఏర్పాటు చేసి బిర్యానీలతో పాటు హలీంలను విక్రయిస్తున్నారు. వీటితో పాటు రకరకాల చికెన్, మటన్ ఐటమ్స్‌తో పాటు ఖద్దూర్ (కీర్), స్వీట్లు అందిస్తున్నారు.

హలీం తయారీకి నైపుణ్యం కావాలి



హలీం తయారీ చెప్పినంత సులువు కాదు. అందుకు నైపుణ్యం అవసరం. దినుసులను సమపాళ్లలో కలపడంతో పాటు చికెన్, మటన్‌లను బట్టీపై మెత్తగా ఉడికించాలి. వంట పూర్తయ్యే వరకు కలయతిప్పుతూ ఉండాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అడుగంటి రుచిలో తేడాతో పాటు నాణ్యత లోపిస్తుంది. నా చిన్నతనం నుంచి హైదరాబాద్‌లో హలీం తయారీలో పని చేస్తున్నా. గత రెండేళ్లుగా రంజాన్ మాసంలో ఇక్కడికి వచ్చి తయారు చేస్తున్నా.

– షేక్ హర్షద్, వంట మాస్టర్, హైదరాబాద్

మాంసాహార వంటకాలకు డిమాండ్



రంజాన్ మాసంలో హలీంతో పాటు ఇతర మాంసాహార వంటకాలకు డిమాండ్ ఉంటుంది. చికెన్ తిరంగా టిక్కా , స్టిక్ చికెన్, స్పెషల్ కబాబ్‌తో పాటు ప్రత్యేకమైన స్వీట్లు తయారు చేస్తాం. దేనికదే ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటాయి. కీర్ తయారీలోనూ వైవిధ్యం ఉంటుంది. – సా వసీమ్, వంటమాస్టర్, ఒడిశా

చాలా బాగుంది



హలీం చాలా బాగుంది. గతంలో రంజాన్ నెలలో హైదరాబాద్ వెళ్లినప్పుడు తినేవాన్ని. ఇప్పుడు ఇక్కడ కూడా దొరుకుతోంది. ఇది కూడా హైదరాబాద్ హలీంలా బాగుంది. రంజాన్ నెల వచ్చిందంటే కచ్చితంగా తింటాను.

–ఆర్.అంజిరెడ్డి, నరసరావుపేట

ప్రతి రంజాన్‌కు తింటాను



రంజాన్ నెల వచ్చిందంటే హలీం తినాల్సిందే. నెలలో అనేకసార్లు తింటాను. గతంలో హైదరాబాద్‌లోనే దొరికేది. ఇప్పుడు ఇక్కడ కూడా వంటవాళ్లను రప్పించి తయారు చేయిస్తున్నారు. మాంసాహార ప్రియులు ప్రతి ఒక్కరూ రంజాన్ నెలలో హలీం తినాల్సిందే.

–డి.సురేంద్ర, నరసరావుపేట

క్లుప్తంగా

కాయిర్ ఇండస్ట్రీలో భారీ అగ్ని ప్రమాదం



వినుకొండ టౌన్: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల నాగలక్ష్మి కాయిర్ ఇండస్ట్రీలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందిన మేరకు స్థానిక అగ్నిమాపక శాఖ అధికారులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఆస్తి నష్టం భారీగా ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. సంఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

టీడీపీ నాయకుడు కోవెలమూడి నానిపై కేసు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నాయకుడు కోవెలమూడి నాని అనుమతులు లేకుండా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల ఒకటో తేదీ రాత్రి కోవెలమూడి నాని తన జన్మదిన వేడుకలను అశోక్‌నగర్ మెయిన్ రోడ్డులో అనుమతులు లేకుండా జరిపారు. ర్యాలీ నిర్వహించి వాహన రాకపోకలకు అంతరాయం కలిగించారు. బాణసంచా కాల్చి హంగామా చేశారు. టీడీపీ అభ్యర్థుల ఫ్లెక్సీలను స్టేజీ వద్ద ఏర్పాటు చేశారు.

పేదల ఆత్మ బంధువు సీఎం వైఎస్ జగన్

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- మాచర్ల నెహ్రూనగర్ 1, 2 వార్డులలో ఎన్నికల ప్రచారం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ప్రతి ఇంటా పిన్నెల్లికి స్వాగతం పలికిన మహిళలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్కేకు హారతినిస్తున్న మహిళలు

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.లక్ష వరకు ఆర్థిక ప్రయోజనాలను అందించి మేలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలోని నెహ్రూ నగర్ 1, 2 వార్డులలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఎన్నికల ప్రచారాన్ని ఏకధాటిగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు జరిపిన అనంతరం ఇంటింటికీ ప్రచార కార్యక్రమం ముమ్మరంగా జరిపారు. ప్రతి కుటుంబాన్ని కలిసి జగనన్న సంక్షేమ పథకాలు వివరించారు. సంక్షేమ పథకాలు యధావిధిగా అమలు జరగాలంటే 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటిలో మహిళలు ఆనందంగా ఉండాలన్న లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేసి అన్నగా, తమ్ముడిగా, కుమారుడిగా అందరికీ తోడుండి కుటుంబాల్లో వెలుగు నింపిన ఘనత జగనన్నకే దక్కుతుందని అన్నారు.పిల్లల భవిష్యత్తు కోసం అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారనే విషయాన్ని గమనించి జగనన్నకు, తనకు మద్దతు పలకాలని ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రతి ఇంటికి వెళ్లి మనవి చేశారు. ఇంటింటికీ రెండు నిమిషాలు సమయాన్ని కేటాయించి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా జరిపారు. ఎంతో ఔదార్యంతో ప్రతి కుటుంబానికి న్యాయం చేసిన సీఎం జగన్ అవసరం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఇలాంటి మంచి పథకాలు అమలు జరగాలంటే మళ్లీ జగన్‌నే సీఎంగా చేద్దామన్నారు. నెహ్రూనగర్ 1వ లైన్ నుంచి నాలుగు వందల ఇళ్ల వరకు తిరిగి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, కామనబోయిన కోటయ్య, వార్డు కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, అరుణ, ఎంఆర్‌ఎఫ్ రామాంజనేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, కరిముల్లా, ఎం శ్రీనివాసరావు, బత్తిన వేణు, చందూగౌడ్, పార్టీ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, నాయకులు హైట్ వీరారెడ్డి, ఆర్ రఘురామిరెడ్డి, చిల్లంచర్ల సత్యనారాయణ, పిన్నెల్లి హనిమిరెడ్డి, కొత్తమాసు బ్రహ్మారావు, లింగారెడ్డితో పాటు వందలాది మంది కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రచారం

ప్రచారం ప్రారంభం నుంచి వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సీఎం జగన్‌కు జేజేలు పలుకుతూ ప్రచార కార్యక్రమంలో భారీ స్థాయిలో పాల్గొన్నారు. నెహ్రూ నగర్ 1వ లైన్‌లో రోడ్లన్నీ కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయాయి. జనం పీఆర్కేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వార్డుల్లో పలువురు మహిళలు తమ ఇంటి వద్దకు పీఆర్కే రాగానే బొట్టు పెట్టి హారతులిచ్చారు. సీఎం జగన్‌కు, పీఆర్కేకు జేజేలు పలికారు. ఉత్సాహంగా జెండాలు చేతబట్టి ఎన్నికల ప్రచారాన్ని భారీ స్థాయిలో నిర్వహించటం, ప్రజల నుంచి అనూహ్య స్పందన రావటంతో వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో ఉత్సాహ వాతావరణం నెలకొంది.

'మా ఉసురు మీకు తగలక మానదు'

- కూటమి కుటిల రాజకీయంపై అవ్వా, తాతల ఆగ్రహం
- దైన్యంలో దివ్యాంగ పింఛనుదారులు
- వలంటీర్ల ద్వారా పింఛన్ల నిలిపివేతపై సర్వత్రా నిరసన

మాచర్ల రూరల్: నాటి జన్మభూమి కమిటీల్లా కాకుండా రాజకీయ వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల చెంతకే చేర్చేందుకు పుట్టుకొచ్చిందే వలంటీర్ వ్యవస్థ. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనలలో మొగ్గ తొడిగిన ఈ వలంటీర్ వ్యవస్థ ఇప్పుడు దేశానికే ఆదర్శంగా మారింది. పలు రాష్ట్రాలు ముున్ముందు అమలు చేసేందుకు ఉత్సుకత చూపుతున్నాయి. అలాంటి సమున్నతాశయంతో ఆవిర్భవించిన ఈ వ్యవస్థపై కూటమి ముసుగులో కుటిల రాజకీయం కన్నుకుట్టింది.ఎలాగోలా ప్రజలకు దూరం చేయాలనే సంకల్పంతో సందర్భం కోసం ఎదురుచూసింది. ఎన్నికల కోడ్ పేరుతో కుట్ర పన్నింది. పర్యవసానం నెలనెలా ఠంచనుగా ఒకటో తేదీనే ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందించే వలంటీర్లు దూరమయ్యారు. తిరిగి పండుటాకులు కార్యాలయాల గడప పట్టాల్సిన పరిస్థితిని తీసుకువచ్చారు. అశనిపాతంగా మారిన ఈ పరిణామంపై అవ్వాతాతలు, దివ్యాంగ బాధితులు ఉసూరుమంటున్నారు. మీ కుటిల రాజకీయాలకు మేమే దొరికామా? అంటూ కూటమి నేతల కుట్రపై మండిపడుతున్నారు.

మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది



మంచం మీద ఉండే నాకు ఒకటో తేదీ తెల్లారు జామునే వలంలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఐదేళ్ల కిందటి చంద్రబాబు పాలనలో పింఛను కోసం పడే పాట్లు తప్పాయనుకున్నాం. మళ్లీ అదే చంద్రబాబు కూటమి మా ఆనందాన్ని ఆవిరి చేసింది. కుటిల రాజకీయాల ఫలితమా అని పింఛన్ అందకుండా పోయింది. అనారోగ్యంతో మంచం మీదనే ఉండే నేను సచివాలయానికి వెళ్లి ఎలా తీసుకోగలను? మా ఉసురు చంద్రబాబునాయుడు కూటమికి తగలకమానదు.

అప్పిరెడ్డి శాంతమ్మ, కొత్తపల్లి.

ఎన్నికల్లో బుద్ధి చెబుతాం



మాలాంటి పండుటాకుల పింఛన్‌కు అవరోధంగా నిలిచినోళ్లకు తప్పనిసరిగా బుద్ధిచెబుతాం. వలంటీర్లు ఒకటో తేదీనే మా చెంతకు వచ్చి పింఛన్ అందించేవాళ్లు. దాన్ని కూడా రాజకీయం చేస్తూ ఎన్నికల పేరుతో అడ్డుకున్నారు. ఇది మీకు తగునా? మాలాంటి పేదోళ్లు ఆనందంగా ఉండటం మీకు ఇష్టం లేదా? మీ స్వార్థ రాజకీయాల కోసం మమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబు. త్వరలోనే తగిన శాస్తి మీకు ఎదురవుతుంది.

కొమ్ము దానం, కొప్పునూరు.

మా కన్నీటి జడిలో కొట్టుకుపోతారు



దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న నాకు వలంటీరు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ , నిత్యావసరాలు అందించేవారు. జగనన్న సురక్ష శిబిరాల్లో మందులు అందించేవారు. అలాంటి నిస్వార్థ సేవలను మానుంచి దూరం చేసి కంటతడిపెట్టించారు. వలంటీర్ల వ్యవస్థను దూరం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మా కన్నీటి జడిలో కొట్టుకుపోతుంది.

మోషే, కొత్తపల్లి

మా గోడు వినేదెవరు..?

- దివ్యాంగ కుమారుడితో తల్లి ఆందోళన
- జగనన్న వస్తేనే తమకు న్యాయం జరుగుతుందని ఆవేదన



దివ్యాంగుడు షేక్ జాన్‌సైదాతో తల్లి అఫ్రిఫున్

క్రోసూరు: క్రోసూరులోని ఆమంచి భవనం సెంటర్ వద్ద షేక్ అఫ్రిఫున్, ఆమె కుమారుడు షేక్ జాన్‌సైదా(దివ్యాంగుడు) నివాసముంటున్నారు. సైదా మంచంపై నుంచి కదలలేని స్థితిలో ఉన్నాడు. ఎవరైనా నిత్యం తోడు గా ఉండాల్సిందే. ఇప్పటివరకు సీఎం జగనన్న అందిస్తున్న గడప గడపకూ పింఛన్లలో భాగంగా తల్లికి వితంతు పింఛన్, దివ్యాంగుడైన కుమారుడికి వికలాంగ పింఛన్ నెలకు చెరో రూ.3వేలు చొప్పున వలంటీర్ తెచ్చి ఇవ్వటం జరిగేది. అటువంటిది ఏప్రిల్, మే నెలల్లో పింఛన్లు వలంటీర్లు ఇచ్చేందుకు అవకాశం లేకపోవటంతో సచివాలయం వద్దకు ఎలా వెళ్లాలంటూ తల్లి కుమారులు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తతతో వేసవి ఎండల నుంచి ఉపశమనం

– జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



నరసరావుపేట: జిల్లాలో ఎండతీవ్రత అధికం కావడంతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రజలకు వేసవి ఉష్ణోగ్రతలపై పలు సూచనలు చేశారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వలన గతేడాదితో పోల్చితే మార్చి నెలలోనే మూడు డిగ్రీలు ఉష్ణోగ్రత అధికంగా నమోదైందన్నారు. ఈ అధిక ఉష్ణోగ్రతలు ఏప్రిల్, మే నెలల్లో కొనసాగే అవకాశం ఉందన్నారు. ఈసారి వడగాల్పుల ప్రభావం కూడా అధికంగా ఉండవచ్చునని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈనెల ఒకటిన మాచర్ల మండలంలో 42.7డిగ్రీలు, వినుకొండ, నరసరావుపేట, గురజాల, కారెంపూడి, రొంపిచర్ల, నూజెండ్ల మండలాల్లో 40 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించారు. మిగిలిన మండలాల్లో 37 డిగ్రీల నుంచి 39 డిగ్రీల వరకు నమోదు అయ్యిందన్నారు. రాబోయే మూడు రోజుల్లో అన్ని మండలాల్లో 42 డిగ్రీలు, రెంటచింతలలో 43 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వాహణ సంస్థ తెలియచేసిందన్నారు. కావున దినసరి కూలీలు ఉదయం పూటనే పనులు పూర్తి చేసుకొని మధ్యాహ్నం లోగా ఇళ్లకు చేరాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని పేర్కొన్నారు. బయటకు రావాలంటే తప్పకుండా గొడుగు సహాయం తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని కోరారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇళ్లల్లో తయారు చేసిన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరినీరు తీసుకోవాలన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి

నరసరావుపేట: ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని ప్రజలంతా వడదెబ్బ బారిన పడకుండా తగు సూచనలు, జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ.రవి కోరారు. దీనికి సంబంధించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం కలిగియుండటం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా, పూర్తిగా అపస్మారక స్థితికి వెళితే వడదెబ్బ తగిలినట్లుగా భావించాలన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రాలను ధరించాలని, నెత్తికి టోపీ, రుమాలు కట్టు కోవాలని, వీలైనంతవరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించాలని సూచించారు. దాహం వేయకపోయినా తరచుగా నీటిని త్రాగాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు కలిసిన నీటిని త్రాగవచ్చునన్నారు. వడదెబ్బకు గురైనవారిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలని తడిగుడ్డతో శరీరం రుద్దుతూ ఉండాలని సూచించారు. ఐస్ నీటిలో బట్టను ముంచి శరీరం తుడవాలన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్ళే ముందు ఒక గ్లాస్ మంచి నీరు త్రాగాలని, ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, చల్లనినీరు త్రాగాలని సూచించారు. తీవ్రమైన ఎండలో బయటికి వెళ్లినప్పుడు తల తిరగటం, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలో వున్న వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొంది వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. శరీరాన్ని డీహైడ్రేషన్‌కు గురిచేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానీయాలు మానుకోవాలని సూచించారు. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోవద్దని అన్నారు.

డాక్టర్ వసంతరావుకు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు గ్రహీత డాక్టర్ వసంతరావును సన్మానిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, విశ్వవిద్యాలయాధికారులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యా విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం. వసంతరావుకు జాతీయ పురస్కారం వరించింది. అహ్మదాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్ మెంట్ కౌన్సిల్ ఆదర్శ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కారం పేరుతో నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డు –2024 ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా వసంతరావును మంగళవారం యూనివర్సిటీలో ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. వసంతరావు పరిశోధనలు యువతరం అధ్యాపకులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రతి అధ్యాపకుడు బోధనా, పరిశోధన పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. అవార్డు గ్రహీత డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ బోధన, పరిశోధన రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు సమర్పించినందుకు గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ తనకు ఈ అవార్డును ప్రదానం చేసిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ప్రొఫెసర్ కె.మధుబాబు, దూరవిద్య కేంద్రం సంచాలకులు డాక్టర్ బి.నాగరాజు, నాక్ సంచాలకులు ప్రొఫెసర్ సంధ్య కోల్, విద్యా విభాగ సమన్వయకర్త డాక్టర్ పి. బ్రహ్మాజీరావు, బీఈడీ కళాశాలల సమాఖ్య అధ్యక్షుడు గుండారెడ్డి, విశ్వవిద్యాలయ విద్యావిభాగ అధ్యాపకులు డాక్టర్ టి.సందీప్, డాక్టర్ రామిరెడ్డి, సిబ్బంది అనిత, వీరబాబు పాల్గొన్నారు.

బాబూ.. దళితులకు క్షమాపణ చెప్పు!

దళిత సంఘాల నాయకులు డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

మంగళగిరి: 54 మంది దళిత పేద బడుగు బలహీనవర్గాలకు ఇళ్ల స్థలాలు దక్కకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్న చంద్రబాబు ముందుగా దళిత జాతికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. ఎస్‌డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం దళితులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బహుజన నాయకులతో కలిసి బహుజన రాజకీయ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. బహుజన పరిరక్షణ సమితి నాయకుడు ఈపూరి ఆదామ్ మాట్లాడుతూ 54 వేల మందికి రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే రాజధానిలో దళిత పేద బడుగు బలహీనవర్గాలు ఉంటే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కోర్టుకు వెళ్లి ఆపిన చంద్రబాబు వారిని ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే కోర్టుకెళ్లి అడ్డుకున్నదెవరని నిలదీశారు. చంద్రబాబుకి టీడీపీకి దళిత బడుగు బలహీనవర్గాలను ఓట్లు అడిగే హక్కు ఎక్కడదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బొలిమేర శామ్యూల్ పాల్గొన్నారు.


ఆగని తనిఖీల పరంపర

ఇప్పటి వరకు రూ.1,84,77,900 స్వాధీనం

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీ బృంధాలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు కొనసాగించారు. ప్రవర్తనా నియమావళిని ఉల్లఘించి తరలిస్తున్న అంశాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గ పరిధిలో 19.5 లీటర్ల మద్యం విలువ రూ.6200, తాడికొండ పరిధిలో రూ.1,24,350 నగదు, గుంటూరు పశ్చిమలో పార్టీ టవల్స్, 500 కరపత్రాలు విలువ రూ.1400, తూర్పులో రూ.10.80 లక్షలు నగదు సీజ్ చేశారని కలెక్టరేట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు జిల్లాలో స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, వస్తువులు విలువ రూ.1,84,77,900 ఉందని పేర్కొన్నారు.

జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- మాచర్లలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 133 ఎస్సీ కుటుంబాలు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ఎస్సీ కుటుంబాల వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పేదలకు సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా చేరుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 31వ వార్డులో వినాయకుని గుట్ట కాలనీకి చెందిన 133 ఎస్సీ కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. కొమ్ము బొంగురు కౌన్సిలర్ వేల్పుల గురవయ్య ఆధ్వర్యంలో పీఆర్కే సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. పీఆర్కే వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి ఒక్క పేద కుటుంబాన్ని ఆదుకోవటమే వైఎస్సార్ సీపీ అజెండా అని అన్నారు. రాబోయే రోజుల్లోనూ వైఎస్సార్ సీపీ పాలనలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా మ్యానిఫెస్టో ఉంటుందని ఆయన చెప్పారు. సీఎం జగన్ సభకు భారీ స్థాయిలో ప్రజలు తరలి వచ్చి జేజేలు పలుకుతున్నారన్నారు. పార్టీలో చేరిన ఆలేటి సామేలు, గెల్లి పోగు సామేలు, కంభంపాటి భాస్కర్‌రావు, కొమ్ము పెద్దోడు, ఆలేటి కోటయ్య, యరసాని నాగేశ్వరరావు, బొనిగె కోటయ్య, ఆలేటి పెనూయేలు, జాన్‌తో పాటు భారీ స్థాయిలో మహిళలు పీఆర్కే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వార్డు కౌన్సిలర్లు విజయమేరి, మందా సంతోషరావు, పార్టీ నాయకులు వేల్పుల దానియేలు, వేల్పుల ఏసులు పాల్గొన్నారు.

నాణ్యమైన తీర్పులకు కృషి చేయాలి


న్యాయవాదులకు జిల్లా న్యాయమూర్తి పార్థసారథి సూచన



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి, పక్కన కాసు వెంకటరెడ్డి, బ్రహ్మారెడ్డి

నగరంపాలెం: న్యాయవాదులందరూ ఐక్యంగా ఉండి, నాణ్యమైన తీర్పులకు కృషి చేయాలని జిల్లా జడ్జి పార్థసారథి సూచించారు. ఇటీవల ఎన్నికైన గుంటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మా ట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమస్యలెదురైతే తన దృష్టికి తీసుకువస్తే, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, నాలుగు, ఐదో అదనపు జిల్లా జడ్జిలు శరత్‌బాబు, నీలిమ, జూనియర్ సివిల్ జడ్జిలు, అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పాలూరి వెంకటరెడ్డి, చెరుకూరి సత్యనారాయణ, శాంతకుమార్, అసోసియేషన్ కార్యదర్శి అనురాధ, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కోశాధికారి దేవదాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు మాతృవియోగం



తలతోటి అన్నమ్మ (ఫైల్)

నాదెండ్ల: రిటైర్డ్ హెచ్‌ఎం, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే టీజే సుధాకర్‌బాబు మాతృమూర్తి అన్నమ్మ (81) సోమవారం రాత్రి కన్నుమూశారు. నాదెండ్ల మండలం, తూబాడు గ్రామంలోని ఆమె స్వగృహంలో వృద్ధాప్యభారంతో మృతి చెందారు. ఈమె కోమటినేనివారిపాలెం, తూబాడు, చిరుమామిళ్ల ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేసి, చిరుమామిళ్ల ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా పదవీ విరమణ పొందారు. ఈమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మూడో కుమారుడైన టీజే సుధాకర్‌బాబు ప్రస్తుతం సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ఉన్నారు. అన్నమ్మ మరణ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నరసరావుపేట వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కె.అనిల్‌కుమార్‌యాదవ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఘన నివాళులర్పించారు. వారితో పాటూ ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, చిలకలూరిపేట మార్కెట్‌యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.